ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 275 ఆదివారం 29-9-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

## - వారు బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది - 'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి





**మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.**

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**
మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను సీఎం రేవంత్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు. రన్‌లో భాగంగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారంనాడు న్యూ పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించారు. జిల్లా కోర్టు, స్వర్‌గేట్ మధ్య నడిచే ఈ భూగర్భ మార్గంతో పుణెలోని అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీనితో పాటు రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. వర్చువల్ తరహాలో వీటిని ప్రధాని ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని హాజరుకావాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత దృష్ట్యా ఆయన పర్యటన రద్దయింది. ప్రధాని వర్చువల్ తరహాలో ప్రారంభోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. పుణెలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సామర్థ్యం కూడా పెంచుకుంటూ పోవాలని, పుణె పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఆధునీకరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం తాము అనేక చర్యలు చేపట్టామన్నారు. సిటీ పెరుగుతున్నప్పుడు ఏరియాల మధ్య అనుసంధానం కూడా గణనీయంగా పెరగాలన్నారు. ఇదే విజన్‌తో మహాయుతి ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తోందని చెప్పారు. మహారాష్ట్రలో ఇంతకముందు అధికారంలో ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కనీసం ఒక మెట్రో పిల్లర్‌ను కూడా నిర్మించలేకపోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం పుణెలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించిందన్నారు. సోలార్ ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్‌పై మాట్లాడుతూ, ఇవాళ విఠల్ భగవానుని ఆశీస్సులతో నేరుగా షోలాపూర్‌కు ఎయిర్ కనెక్టివిటీ కల్పించేందుకు ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్ పూర్తయిందని చెప్పారు.



# తమిళనాడు డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

## మంత్రులుగా మరో నలుగురు



న్యూఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఆయన కుమారుడు, ప్రస్తుత మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఉపముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు. మరో నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. వీరితో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చెన్నైలోని రాజ్‌భవన్‌లో ఆదివారంనాడు ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా హాజరయ్యారు. కొత్తగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఇటీవల మనీలాండరింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిలుపై విడుదలైన వి.సెంథిల్ బాలాజీతో పాటు ఆర్.రాజేంద్రన్ (సేలం-నార్త్) గోవి చెళియన్ (తిరవిడైమరుదూరు), ఎస్.ఎం నాజర్ (అవడి) ఉన్నారు. కాగా, సెంథిల్‌కు విద్యుత్, ఎక్సైజ్ శాఖలను కేటాయించగా, గోవి చెళియన్‌కు సాంకేతిక విద్య, ఎలక్ట్రానిక్స్, సైన్స్ అండ్ టెక్నాలజీతో సహా హైయర్ ఎడ్యుకేషన్ శాఖను కేటాయించారు. నాజర్‌కు మైనారిటీ వ్యవహారాలు,ఆర్.రాజేంద్రన్‌కు పర్యాటక శాఖను ప్రభుత్వం కేటాయించినట్టు రాజ్‌భవన్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయనిధి స్టాలిన్ ఇప్పటికే యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి శాఖను నిర్వహిస్తున్నారు. ప్లానింగ్ అండ్ డవపల్‌మెంట్ శాఖ పర్యవేక్షణ బాధ్యతలు కూడా తీసుకున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఉప ముఖ్యమంత్రిగా ప్రమోట్ అయ్యారు.

# ధైర్యపడొద్దు.. ఇళ్లు ఇస్తాం..

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**మేడ్చల్:** ప్రభుత్వం పక్షాన అన్నివేళల్లో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెడ్లాల పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ, గృహ, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటిలో ఇవాళ (ఆదివారం) నిర్వహించిన రాష్ట్ర స్థాయి 33 జిల్లాల తహసీల్దార్లతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు జోడెడ్లాల పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తహసీల్దార్లకు సూచించారు.

# రేవంత్‌రెడ్డి ధన దాహానికి... నిరాశ్రయులవుతున్న ప్రజలు



## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్: మూసీ పరివాహక ప్రాంత ప్రజల్ని తెలంగాణ సర్కార్ తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.1.50లక్షల కోట్ల ధనదాహానికి లక్షల మంది ప్రజలు నిరాశ్రయులు కాబోతున్నారని ఆయన మండిపడ్డారు. పేదల బతుకులతో ముఖ్యమంత్రి చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కూల్చివేతలు తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇళ్లు కళ్లెదుటే కూల్చివేస్తుంటే ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసా రేవంత్ రెడ్డి? అంటూ ప్రశ్నించారు. ట్విటర్ వేదికగా తెలంగాణ సర్కార్, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.**

**కేటీఆర్ ట్వీట్ ఇదే..**
"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1.50లక్షల కోట్ల ధన దాహానికి ఒకటా రెండా హైదరాబాద్ నగరంలోని లక్షల మంది జీవితాలు చెల్లాచెదురవుతున్నాయి. నగరం రోదిస్తోంది. కూల్చివేతలతో ప్రజల గుండెలు పగిలిపోతున్నాయి. వారి ఇళ్లు చెదిరిపోతున్నాయి. ఆడబిడ్డల ఆవేదనలు, ఇంటి పెద్దల శాపనార్థాలతో నగరం రోదిస్తోంది. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న కుటీరాలను కన్నబిడ్డలకు ఇవ్వలేకపోతున్నామని తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. అమ్మ లాంటి ఇల్లు వదిలి వేరే దిక్కు ఎలా పోతామంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చే ఇల్లు కూలుస్తారేమో అని ఆత్మహత్య చేసుకున్న తల్లి ఒకవైపు, భార్య కడుపుతో ఉన్నా కనికరించరా అంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భర్త మరోవైపు. బీఆర్ఎస్ హయాంలో రైతుల ప్రయోజనం కోసం 30వేల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే రిజర్వాయర్ నిర్మాణం విషయంలో రైతులను రెచ్చగొట్టి శవరాజకీయాలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నావ్. ఆనాడు అలా చేసి నేడు నీ అవసరానికి ఎంత నీచానికైనా తెగిస్తావని మరోమారు నిరూపించావు. మహా నగర ప్రజలారా మీరు అధైర్య పడొద్దు. ఇప్పుడు జరుగుతున్న విధ్వంసంతో తొందరపడి ప్రాణాలు బలితీసుకోవద్దు. న్యాయస్థానాలు ఉన్నాయి. మీకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది" అని ట్వీట్ చేశారు.

**మూసీ మార్కింగ్ నిలిపివేత..**
మరోవైపు ఏళ్ల తరబడి ఉంటున్న తమను ఒక్కసారిగా వెళ్లమనడంపై మూసీ ప్రాంతం ప్రజలు అధికారులను నిలదీశారు. వాగ్వాదాలు, ఘర్షణలకు దిగుతుండడంతో మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపి వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్కింగ్ నిలిపివేశారు. మరోవైపు శనివారం నిర్వాసితులతో అధికారులు చర్చలు జరిపారు. మూసీ పక్కన ఇబ్బందులు పడే కంటే.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రశాంతంగా ఉండాలని స్థానికులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇంటి విలువ రూ.30లక్షలకు పైగానే ఉంటుందని చెప్పారు.

# హైదరాబాద్‌లో వందల చెరువులు ఆక్రమణకు గురయ్యాయి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**
మూసీ పునర్జీవం కార్యక్రమంలో నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి పునరావాస చర్యలు చేపడుతున్నా మని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శాన్ ఫ్రాన్సిస్కోలో తెలుగు కమ్యూనిటీ అండ్ గ్రీట్ సమావేశం ఇవాళ(ఆదివారం) జరిగింది. ఈ సమావేశంలో హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో వందల చెరువులు కనపడకుండా పోయాయని చెప్పారు. చెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురికాకుండా ఆపాలనేది తమ ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. మూసీ నదిలో మంచినీరు పారించడం పార్కులు తయారు చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడటమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పుకొచ్చారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో కుటుం బాలు ఆరోగ్యంగా జీవించేం దుకు ఆ నదిని తీర్చిద్దాలనేది ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. కలుషితమైన మూసీ నదిలో జీవించడం ఎవరికి కూడా మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు.



# శ్రామిక శక్తిని క్యాష్ చేసుకుంటున్న పారిశ్రామికవేత్తలు



**న్యూఢిల్లీ :** ఏటేటా కార్మిక దినోత్సవాలు జరుపుకుంటూ,,మేడే ఉత్సవాలు నిర్వహిస్తున్నా కార్మిక రంగం మాత్రం పురోగతి సాధించడం లేదు. కార్మికుల శ్రమశక్తితో ఎదుగుతున్న వారు వారిని పట్టించుకోవడం లేదు. గతం కన్నా మిన్నగా శ్రమదోపిడీ ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కానవస్తోంది. యాంత్రికయుగం రాక ముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1923లో మొదటిసారి భారతదేశంలో 'మే డే'ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి 'మే డే'ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవ ర్గాలు బహుళజాతి కంపెనీలకు హామిలి స్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# ప్రాంతీయ పార్టీల మనుగడపై బిజెపి దెబ్బ

## ఇడి, సిబిఐ వేధింపులతో దెబ్బతీసే యత్నం



**న్యూఢిల్లీ :** ప్రాంతీయ పార్టీల నేతలను భయపటెటడం ద్వారా బిజెపి దేశంలో బలమైన రాజకీయ పార్టీగా తిరుగులేకుండా చేసుకోవడం కోసం ఎత్తులు వేస్తోంది. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మరింతగా వేదింపులు తప్పవన్న బయం కూడా ఉంది. దీంతో ప్రాంతీయ పార్టీలకు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్ ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు. కాని 9 సంవత్సరాల పాలన తర్వాత కూడా ఆయన దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయలేకపోయారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ప్రాంతీయ పార్టీల్లో అధికారంలో ఉన్న వైసీపీ రెండోసారి ఎన్నికల్లోనే సంకట పరిస్థితిలో పడింది. తెలుగుదేశంతో రాజకీయంగా పోరాడే బదులు ఎన్నికల సమయంలో కేసులు మోపడమే వైసీపీ అత్మరక్షణలో పడిందనడానికి నిదర్శనం. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. గుజరాత్, గోవాలో కాంగ్రెస్ ఓట్లను చీల్చారు, తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను బీజేపీ చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. సమాజ్‌వాది పార్టీని అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితిని కల్పించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ తర్వాత బీజేడీ భవిష్యత్ ఏమిటన్నది ప్రశ్నార్థకమైంది. తాజాగా జార్ఖండ్‌లో కూడా హేమంత్ సోరెన్‌ను సిఎం పదవి వీడేలా చేసింది. దేశంలో అనేక చిన్నా చితక, ఉప ప్రాంతీయ పార్టీలు మోదీ భయంతో బీజేపీతో చేతులు కలపక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల తర్వాత ఎన్ని ప్రాంతీయ పార్టీలు ఉంటాయో, ఎన్ని మిగిలిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# ప్రచారంలో..అందరూ జాదూగాళ్లే !



సిద్ధాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం.. బురదజల్లడం, ఓట్లను లాగడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణం అయ్యింది. ఓ మూడు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దోచుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరికి ఒకరు పోటీ పడుతున్న తీరు భారత ప్రజాస్వామ్యంలో వేళ్లూనుకుపోయింది. ప్రజలు పేదలుగా ఉండిపోవాలి. అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు,తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితిమీరిన వాగ్దానాలు చేయటం చూస్తున్నాం. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హేల జాబితా తయారయ్యింది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది. తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ,గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం చూస్తున్నాం. అధికారం ద్వారా సంపదను పోగుచేసుకోవడం లక్ష్యంగా రాజకీయం సాగడం వల్ల అధికారం కోసం ఇలా నానాగడ్డీ కరుస్తున్నారు. మనకు స్వాతంత్రం లభించినప్పటి నుంచి పాలించిన పార్టీలు గాని, తర్వాత ఉనికిలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, కులపార్టీలు, వేర్వేరు సిద్ధాంతాల పార్టీల గాని క్రమంగా తమ పరిపాలనలో విఫలమవుతూ వచ్చాయి. సిద్ధాంతాలకు దూరమవుతూ వచ్చాయి. ఆర్థిక సంస్కరణలు వ్యక్తులు, నాయకులు, పార్టీలు సంస్థల ప్రాపంచిక దృక్పథాన్ని గణనీయంగా ప్రభావితం చేయసాగింది. అధికారంలో ఉంటే సుఖాలు అనుభవించవచ్చు. అప్పనంగా సంపాదించవచ్చు. అన్న ఏకైక లక్ష్యం కోసం రాజకీయ పార్టీలు ప్రజలను సమిధలుగా చేస్తున్న తీరు ప్రతి ఎన్నికల్లోనూ చూస్తున్నాం. ప్రజలు మంచి అనుకున్న వారిని నమ్మి గద్దెనెక్కించినా వారు కూడా అలాగే తయరావుతున్నారు. తెలంగాణలో ఉద్యమం చ ఏసిన పార్టీనే గద్దెనెక్కిస్తే ఎంతగా భ్రష్టుపట్టించిందో చూశాం. ఎపిలో అయితే బటన్ నొక్కుడే అభివృద్ధి అని కొత్త తరహా రాజకీయం నెరిపారు. ఇలా ఎవరిని నమ్మాలి. కేంద్రంలో మోడీని నమ్మితే ఆదానీ, అంబానీలు రాజ్యమేలుతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తూ..బతకడం అన్నది భారంగా చేశారు. అంతకు ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అవినీతి ఊడలు విశ్వవ్యాప్తం అయ్యాయి. అయినా ఇవే పార్టీలు మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయి.దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా నేటికీ ఇదే దుస్తితి కొనసాగుతున్నది. చివరకు వామపక్షాల ఏలుబడిలో వరుసగా 34 సంవత్సరాలు బెంగాల్ ఎలా తయారయ్యిందో చూశాం.

# ఎవరి కోసం పార్లమెంట్ ?



గత కొన్నేళ్లుగా పార్లమెంటులో చర్చ అన్న అంశం లేకుండా పోయింది. కేవలం రచ్చ మాత్రమే సాగు తోంది. ఇరు పక్షాలు ఇదే కోరుకుంటున్నాయన్న అనుమానాలు కలుగుతున్నాయి. చర్చచేస్తే డొల్లతనం బయట పడుతుందేమో అన్న భయం అధికారపక్షానికి ఉండివుంటుంది. చర్చలో పసలేకుంటే ఎలా అన్న భయం విపక్షాల్లో ఉన్నట్లుగా ఉంది. అందుకు ఇరుపక్షాలు చర్చకు దూరంగా ఉంటున్నాయి. ఫలానా సెక్షన్ కిందే చర్చించాలని పప్రతిక్షం పట్టు పడుతుంటే..కాదుకాదు..ఫలాన సెక్షన్ కిందే చర్చిస్తామని అధికారపక్షం చెబుతోంది. మొత్తంగా మండుతున్న మణిపూర్ వ్యవహారం పార్లమెంటులో మాత్రం అంటుకోవడం లేదు. ఎందుకంటే చర్చజరిగితే ఏదైనా నిగ్గు తేలేది. సమస్యపై చర్చించడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. అంతుకు మించి..రాజకీయంగా లబ్దిపోందాలన్న ఆకాంక్షలో విపక్ష సభ్యులు ఉన్నారు. దాదాపు వారం రోజులు కావస్తున్నా..ఆందోళనల వరదలో సమస్యలు కొట్టుకుపోయా యి. అందులో మణిపూర్ ఘటన కూడా ఉంది. గత పార్లమెంట్, శీతాకా సమావేశాలను తీసుకుంటే ఇలాగే సాగింది. విపక్షం పట్టుబట్టడం..అధికార పక్షం తోసిపుచ్చడం అన్న ఆనవాయితీ కొనసాగుతోంది. ఎన్నాళ్లిలా పార్లమెంట్ సమయాన్ని వృధా చేస్తారా అన్నది చూడాలి. బలహీనమైన విపక్షం అన్న కారణంగా అధికార పక్షం తలొగ్గడం లేదు. ఈ పద్ధతి కాదులే అని మోదీ సర్కారుపై విశ్వాసపరీక్షకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ రకంగా అయినా చర్చించాలన్న ఉద్దేశ్యం ఉంటే మంచిదే. అలా కాకుండా ఏదో సర్కార్‌ను ఇరుకున పెట్టాలన్న దురుద్దేశ్యం ఉంటే ప్రజలు మాత్రం క్షమించరు. పార్లమెంటును ఉపయోగించుకోలేని విపక్షం అని ఇప్పటికే చర్చ జరుగుతోంది. మొత్తంగా విపక్షాల నోటీసులకు స్పందించిన స్పీకర్ ఓంబిర్లా...పార్టీలతో చర్చించి తేదీని ప్రకటిస్తానన్నారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటు ముందు ఉంచి చర్చించి, సర్కార్‌ను నిలదీయడంలో ఇప్పటికే విపక్షాలు విఫలం అయ్యాయి. మణిపూర్ సంక్షోభంపై మాట మాట్లాడని మోదీ ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి కానీ ఏకాభిప్రాయం సాధిస్తాయా అన్నది చూడాలి. మోదీ ప్రభుత్వంపై ఇది రెండో అవిశ్వాస తీర్మానం కావడం గమనార్హం. మొత్తంగా ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అవిశ్వాస తీర్మానం ఎదుర్కోనున్నది. రూల్ 198 కింద కాంగ్రెస్ లోక్‌సభాపక్ష ఉప నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ తీర్మానం ప్రవేశపెట్టగా నిబంధనల ప్రకారం 50 మందికి పైగా సభ్యులు మద్దతు తెలిపారు. దీనిపై 10 రోజుల్లోగా చర్చించాల్సి ఉంటుంది. మణిపూర్ అ÷–లలర్లపై ప్రధాని మోదీ నోరు మెదపడం లేదన్న సాకుతలో విపక్షాలు అవిశ్వాస తీర్మాన అస్త్రాన్ని ప్రయోగించాయి. ఈ విధంగానైనా సభలో ప్రభుత్వ తీరును ఎండగట్టే అవకాశం వస్తుందన్న వ్యూహంతో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఉంటాయి. ఓవైపు మణిపూర్ లో హింసాకాండ, మహిళలపై అఘాయి త్యాలు చోటుచేసుకుంటుంటే.. ప్రధాని మోదీ మౌనంగా ఉండ టాన్ని ప్రతిపక్ష నేతలు తప్పుబడుతున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై దాదాపు వారం కావస్తున్నా మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాకుండా, ఉభయ సభలను వాయిదాల పర్వంలో నడిపిస్తున్నది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని పార్లమెంట్ వేదికగా ఎండగట్టేందుకు విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడం ఇది రెండోసారి. 2018, జూలై 20న ప్రతిపక్షాలు మొదటిసారి అవిశ్వాసం పెట్టాయి. అయితే లోక్‌సభలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ ఉండటంతో అది వీగిపోయింది. ప్రస్తుతం 543 మంది సభ్యులు గల లోక్‌సభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 330 మంది ఎంపీలు ఉన్నారు. కాంగ్రెస్‌తో కూడిన విపక్ష కూటమికి 140 మంది ఎంపీల మద్దతు ఉన్నది. ఈ రెండు గ్రూపుల్లో లేని ఇతర పార్టీలకు 60 మంది ఎంపీలు ఉన్నారు. దేశ చరిత్రలో కేంద్ర ప్రభుత్వంపై 27 సార్లు అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టారు. తాజా అవిశ్వాస తీర్మానం 28వది అవుతుంది. సభలో బలాన్ని నిరూపించుకొనే క్రమంలో 'విశ్వాస తీర్మానం'పై జరిగిన ఓటింగ్‌లో ఓడిపోయి.. 1990లో వీపీ సింగ్, 1997లో హెచ్‌డీ దేవెగౌడ, 1999లో ఏబీ వాజపేయి ప్రభుత్వాలు కూలిపోయాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ అత్యధికంగా 15 సార్లు అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొన్నారు. 1979లో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరుగకుండా ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామా చేశారు. మరోవైపు అధికార పక్షం విపక్షాల తీరును పెద్దా పట్టించుకోవడం లేదు. మణిపూర్‌పై చర్చ చేపట్టాలని నినాదాలు చేస్తున్న క్రమంలో సభ వాయిదా పడుతూనే ఉంది. ఏదో ఓ రకంగా..ఏదో సెక్షన్ కింద చర్చించాలన్న పట్టుదల విపక్షాల్లో కానరావడం లేదు. ఇదే అదనుగా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం అరు బిల్లులను ప్రవేశపెట్టింది. వాటిల్లో అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును ఆమోదించుకుంది. మణిపూర్‌తో పాటు ఇతర సమస్యలపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు విపక్ష ఇండియా కూటమి ఎంపీలు హాజరయ్యారు. మొత్తంగా సభలు ప్రజలతో సంబంధం లేని సంస్థలుగా మారాయి. పార్లమెంట్ సమయం వృధా అవుతున్న అధికార, విపక్షాలకు పట్టింపు లేకుండా పోతోంది. వచ్చే ఎన్నికల నాటికి ఇలాగే ఉంటుంది. వర్షాకాల సమావేశాలు కూడా గత వర్షాకాల, శీతాకా సమావేశాల్లో లాగే వృధా కావడం చూస్తాం. బాగా నిలదీసామని విపక్షం అనుకుంటే విపక్షానికి ఎక్కడా లొంగలేదని అధికార పక్షం సంతోషంగా ఉంటుంది. పార్లమెంట్‌కు ఎన్నుకున్న ప్రతినిధులకు బాధ్యత లేకుండా పోతోందని అనుకోవడానికి ఇంతక న్నా నిదర్శనం అక్కర్లేదు.

# ఖాతాదారులపై ఛార్జీల దాడి

## మొండి బకాయిలపై నిర్లక్ష్యం

## బ్యాంకుల తీరుతో సామాన్యులపై భారం

**ముంబయి :** దేశంలో బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారి విషయంలో ఎలాంటి చర్యలు కానరావడం లేదు. కొందరు దేశం విడిచి పారిపోయారు. వారు ఇప్పట్లో తిరిగి వస్తారని కానీ, ఎగవేసిన రుణాలను చెల్లిస్తారన్న ఆశలు మాత్రం కానరావడం లేదు. గత పదేళు ్లగా ఇది చూస్తూనే ఉన్నాం. నల్లధనం తీసుకురాలేదు. ఎగవేతదారులను పట్టి తేలేక పోయాం. ఇకపోతే కాలక్రమేణా బ్యాంకులు సామాన్యలకు దూరం అవుతున్నాయి. రకరకాల ఛార్జీలతో ఖాతాదారులను వేధిస్తున్నారు. ఎటిఎం మొదలు ఎలాంటి పనికైనా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించక పోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. బ్యాంకుల తీరు కారణంగా బ్యాంకుల్లో డబ్బు దాచుకునేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఖాతాదారులకు అండగా ఉండాల్సిన బ్యాంకులు పనితీరు రానురాను వారినుంచి ముక్కుపిండి ఏ రూపంలో డబ్బులు వసూలు చేయాలో అన్న రీతిలో ఉంటున్నాయి.ఇకపోతే మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండిబకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ.2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాబై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ.4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101